# చామర గ్రాహిణి

("కృష్ణాపత్రిక")

**శా**లివాహన శకము నూట రెండవ సంవత్సరము. రోము నగరములో నానాడు పెద్ద గుంపులు గూడి యొకయింటి ముందు జనము సందడిగా నుండెను. ఆ సందడికి కారణము హెలీనా యను గొప్ప సౌందర్యవతి రెండు నెలలు ఎడారులలో బహుదేశములగుండ ప్రయాణము చేసి రోము నగరమునకు తిరిగి వచ్చెను. ఆమె నాలుగేండ్లక్రితము ఆంధ్రచక్రవర్తి గౌతమీపుత్ర యజ్ఞశ్రీ శాతకర్ణికి చామర గ్రాహిణిగా వెళ్ళెను. ఆమె తిరిగి వచ్చుటయే ఈ సందడికి కారణము.

ఆమె నాలుగేండ్ల క్రితము వెళ్లినప్పుడు, రోము నగరములో పెద్ద సభలు చేసి యామెను ప్రశంసించి, యామెకు బహుమానము లిచ్చిరి. సామాన్యముగా నా రీతిగ చామర గ్రాహిణులుగ వెళ్ళిన అందకత్తెలు పదునైదేండ్ల వఱకు తిరిగిరారు. ఈమె నాలుగేండ్లలోనే తిరిగివచ్చెను. ఆమె అంత తొందరగా నేల తిరిగివచ్చెనో ఎవ్వరికిని తెలియదుగాని, అంత దూరదేశమునుండి తిరిగివచ్చిన యామె వలన భారత దేశము యొక్కయు, ఆంధ్రదేశము యొక్కయు వర్తమానములు తెలిసికొనవలెనని తహతహతో నామె యింటి చుట్టును జనము మూగియుండిరి. ఆమె మహాధనవంతురాలైయుండును. ఆంధ్రదేశమునుండి రత్నములు, ముత్యములు, సన్నని పట్టుసెల్లాలు, దంతపు సామానులు, జవ్వాది, కస్తూరి, ఏలకులు, లవంగాలు, మొదలైన అపురూపములైన ద్రవ్యములు ఆమె తెచ్చియుండును. ఆంధ్రదేశమునుండి ఈ మహాద్రవ్యములు సంవత్సరమున కొకసారి ఆంధ్రదేశ వర్తకులు తెచ్చి అమ్ముచుందురు. కాని వాని వెల యధికమగుట చేత, మహాధనవంతులే కొందురు. రాజులునూ, జమీందారులే కొందురు. సామాన్యజనము వానియొక్క ముక్కుమొగము నెఱుగరు. లవంగము, ఏలక్కాయ మొదలైన వస్తువుల రుచియెఱుగరు. జాపత్రియు, లవంగము తిన్నచో నాలుక తిమ్మిరిగా నుండునట. ఈ తిమ్మిరి యన్నమాట వారి భాషలో లేదు. జిహ్వేంద్రియము పొందెడు నీ యనుభూతి ఏదో యవిస్పష్టముగా జెప్పుకొనుటయే కాని యిదమిత్థమని వారికి తెలియదు. దానికి తగినమాట వారి భాషలో లేదు.

కస్తూరి యొక్క పరిమళము వారెఱుగరు. పూర్వమెల్ల ధనవంతులు, మహారాజులు వానిని కొని యుపయోగించుటచేత రోము నగరములోని ప్రజాసామాన్యము వానిని గుఱించి వినుటయే కాని చూచి యెఱుగరు. వానిని రుచిచూచుటయు వాసన చూచుటయు మొదలే లేదు.

హెలీనా సామాన్య సంసారుల బిడ్డ. మసిపాతలో గట్టిన మాణిక్యము. ఆమెను రోము నగరములోని ధనవంతులు చాలమంది వాంఛించిరి. కాని నాలుగేండ్ల క్రితము ఆంధ్రచక్రవర్తి యొక్క యధికారులు చక్రవర్తికి చామరగ్రాహిణులు కావలెనని రోము నగరమునకు వచ్చిరి. సామాన్యముగా చామరగ్రాహిణుల కొఱకు జమీందారుల బిడ్డలను, రాజవంశీయులైన స్త్రీలను మాత్రమే తీసికొనిపోదురు. ఈ హెలీనా సామాన్య సంసారుల బిడ్డయైనను లోకోత్తర సౌందర్యవతి యగుటచేత పదిమందియు నామె పేరు చెప్పగా నాంధ్రచక్రవర్తి యధికారులు ఆమెను తీసికొనిపోవుట కంగీకరించిరి. కాని యొక నియమమును పెట్టిరి. ఆమె రాజవంశీయురాలు కాదన్న హేతువుచేత చక్రవర్తి యామెను నిరాకరించినచో మఱుసంవత్సరము వచ్చెడి సార్థవాహులు వెంట తిరిగి పంపివేయుదుమని (సార్థవాహులనగా వర్తకుల గుంపు) ఏడాది కొకసారి యీ సార్థవాహుల ఆంధ్రదేశము నుండి రోము నగరమునకు పోవుదురు.

ఒక చామరగ్రాహిణిని ఆంధ్రచక్రవర్తి స్వీకరించినచో ఆమె కుటుంబమునకు చక్రవర్తి బారువ తూకము గల రత్నమాణిక్యములు ముత్యములు నిచ్చును. తక్కిన సుగంధద్రవ్యములు రెండు బారువ లిచ్చును. సామాన్యముగా నామె పదునేనేండ్లు చక్రవర్తికి చామర గ్రాహిణిగా నుండును. చక్రవర్తి స్వీకరించునాటి కామెకు పదునాఱేండ్లు మించి యుండరాదు.

హెలీనాను చక్రవర్తి అంగీకరించెను. దానికి కారణమామె సౌందర్యము. ఆమె శరీరచ్ఛాయ వట్టి తెలుపు కాదు. చంద్రుని సానపెట్టిన రాపొడి – తేనెలో మెదపి తెచ్చినట్లుండును. తుమ్మెదలవంటి శిరోజములు ఆమె సౌందర్యమంతయు నా విశాలములైన నేత్రములలో నున్నది. నేత్రములు విశాలము లనుటచేత ఆమె కన్నులలోని సౌందర్యము చెప్పినట్లు కాదు. ఆమె కనుపాపలలో నుండి వచ్చుకాంతి సాటిలేని వెలుగు, ఆ వెలుగు కంటె ఆ వెలుగు వ్యాపించు పద్ధతి

యింత యందముగా నుండునని చెప్పుటకు వీలు లేనిది. ఆమె శరీరావయవ కాఠిన్యము, నైగనిగ్యము, స్నిగ్ధత్వము - పాలరాతి విగ్రహమని చెప్పవలయును. ఆమెను చూచి చక్రవర్తి అంగీకరించెను. అంగీకరించుటయే కాదు, ఆమెను ప్రధాన చామరగ్రాహిణిగా చేసెను.

చామర గ్రాహిణులు అంతఃపురస్త్రీలు. వారి భోగములు రాజభోగములు. వారు బైటకు బోయినచో పల్లకీలలో బోదురు. వారి వంక కన్నెత్తి యెవ్వరును చూడరాదు. వారు చామర గ్రాహిణులని తెలియనిచో రాజకన్యక లనియే యనుకొనవలెను. వారి శరీరమందుగల భూషణములు రత్నమయములై, వారు ధరించు చీరలు పసిడి మయములై యుండును. అదియొక మహాభోగము. చక్రవర్తి వారి మనవులను సర్వదా పాలించును. ఆనాడు స్త్రీయై జన్మించుటయందు చారితార్థ్యములు రెండు. మొదటిది ఆంధ్రచక్రవర్తికి రాణియగుట. దాని తర్వాతిది చామరగ్రాహిణి యగుట!

హెలీనా వెళ్ళిన నాలుగేండ్లుగ ప్రతిసంవత్సరము తన తల్లిదండ్రులకు వెలగల రత్నములు, కస్తూరి, జవ్వాజి, లవంగములు, ఏలక్కాయలు, జాపత్రి, జాజికాయ, చలువ మిరియాలు, వక్కలు, తమలపాకులు పంపించుచుండెను. అవి వచ్చినప్పుడామె తల్లిదండ్రులు, ఇరుగు పొరుగు వారలు వచ్చి యడిగిన వారందరకు వానిని రుచి చూపించుటయు, కొంచెము కొంచెము వారి కిచ్చుటయు జేయుచుండిరి. వారున్న నగర భాగములో పలుమంది లవంగపు రుచి యెఱుగుదురు. ఏలకుల రుచి యెఱుగుదురు. కస్తూరి పరిమళ మెఱుగుదురు. రత్నము లిట్లుండునని యెఱుగుదురు. వారితరులకీ రుచి విశేషములను దెల్పుటయు, తక్కినవారాశ పడుటయు, నాలుగేండ్లుగ రోమునగరము నందలి ప్రజాసామాన్యములో చాలామందికి హెలీనా తల్లిదండ్రుల యదృష్టము. తాము కూడ నా యనుభూతిని పొందవలెనని యభిలాష ప్రకటింపబడుచుండెను.

ఇట్టి స్థితిలో హెలీనా యింటికి తిరిగివచ్చెను. వచ్చునప్పుడు రెండొంటెల మీద సామాను తెచ్చెను. అదియంతయు తన్నగరమునందు పంచిపెట్టుటకే తెచ్చుచుండెనని ప్రతీతి వ్యాపించెను. జనమెందుకు మూగరు?

హెలీనాకు నాలుగు దినములు తెలుపిలేదు. వచ్చినవారందఱుకు తాను తెచ్చిన వస్తువులను చూపించుటయు, కస్తూరి మొదలైన ద్రవ్యములు కొంచెము కొంచెముగ పంచియిచ్చుటయు జేసినది.

పది దినములైన తరువాత నీ సద్దు మణిగినది.

ఈ పదిదినములు 'డార్టిమో' వారి యింటికి వచ్చుచునే యుండెను. డార్టిమో ఒక జమీందారుని కుమారుడు. హెలీనా చామరగ్రాహిణిగా వెళ్ళకముందు డార్టిమో హెలీనాను ప్రేమించెను. ఆమె ప్రేమ సంపాదించుటకు బహుప్రయత్నములు చేసెను. ఈమె సామాన్యుల బిడ్డ. ఒక జమీందారు కొడుకీమెను పెండ్లి చేసికొనుట కన్న నామె తల్లిదండ్రుల కేమీ కావలయును. అందఱును సుముఖముగా నుండిరి. సౌముఖ్యములేని దొక్క హెలీనాయందే. ఆమె యతని ప్రేమను నిరాకరించెను. పూర్తిగా నిరాకరించెనని చెప్పుటకు వీలులేదు. నిరాకరించనులేదు. అంగీకరించను లేదు. ఆమెకు తాను మహాసౌందర్యవతినని తెలియును. తనయంతటి సౌందర్యవతి భూమండలమందుండదని ఆమె యనుకొనెను.

సౌందర్యమునకు వివేకమునకు నాత్మజ్ఞానమెక్కువ. ఆత్మాభిమాన మెక్కువ. ఆమె హృదయములో ఒక కోరిక యుండెడిది. తానొక చక్రవర్తికి భార్య కావలయునని, తాను చామరగ్రాహిణిగ తీసికొని పోబడుచున్నపుడు తన కోరిక ఫలించునని యామె యూహ! ఆమె తల్లిదండ్రులు ధనముమీద ఆశపడినను తమ కూతురు పదునేనేండ్లంత దూరదేశమున నుండుటకు మనస్సులో నంత యంగీకరించలేదు. హెలీనా యొక్క పట్టుదల చేతనే వారి సంపూర్ణమైన యంగీకారము దొరకెను. చామరగ్రాహిణులు చక్రవర్తి భార్యలు కారని వారికి తెలియును. తిరిగి తమ కూతురు తమ దేశమునకు రావచ్చును. రాకపోవచ్చును. కొందరు చామరగ్రాహిణులు ఆంధ్రదేశమందే తమ ముప్పదియైదవ యేటనో, ముప్పదియాఱవ యేటనో, వివాహమాడి యుండిపోవుట కలదు. నృత్యగీతాదులు నేర్చుకొని ఆ వృత్తి నవలంబించుటయు కలదు. ఒకవేళ హెలీనా తన దేశమునకు తిరిగివచ్చినచో వచ్చెడి నాటికి వయసు ముదిరియుండును. ఇచ్చట వివాహమగుటయు కష్టమే! కాని జీవితాంతము సంపదలతో తులతూగవచ్చును.

ఆ దేశములో 'డెల్ఫాస్' అన్న గ్రామమున్నది. ఆ గ్రామములో సోదె చెప్పుదురు. హెలీనా పోయి తన పదునేనవయేట సోదె యడిగెను. నీవొక చక్రవర్తియొక్క యంతఃపురములో నుందువని సోదె చెప్పబడెను. ఆ మాటకు తాను చక్రవర్తి భార్య నగుదునని హెలీనా వ్యాఖ్యానము చేసికొనెను. అన్నియు నట్లు పొసగినవి.

హెలీనా తిరిగి వచ్చినందులకు డార్టిమో యొక్కడే సంతోషించెను. తల్లిదండ్రులకు తమ కేటేట వచ్చు సిరిసంపదలు కట్టుపడ్డవని దుఃఖమయ్యెను. కాని గ్రుడ్డిలో మెల్ల! హెలీనా వచ్చుచు బహు రత్నములు తెచ్చెను. వానితో వారు చాలామంది జమీందారుల కంటె ధనవంతులు కావచ్చును. ఒక జమీందారీ కొనవచ్చును. అయినను తన కూతున కొక్క యదృష్టము తొలగిపోయినట్లు వారు భావించిరి. డార్టిమో మాత్రము తన కదృష్టము పట్టినట్లు భావించెను.

డార్టిమో తల్లిదండ్రులకిది యిష్టము లేదు. పూర్వపు రోజులలో నామె సౌందర్యమునకు వారుగూడ ముగ్ధులై తమ కొడుకా పిల్లను చేసికొనుట కంగీకరించిరి. ఇప్పుడు వారి కేమియు నిష్టము లేదు. చామరగ్రాహిణి యనగా వారికేమిటో తెలియదు. చక్రవర్తికి భార్య వంటిది చామరగ్రాహిణి యని వారి యభిప్రాయము. సరిగా భార్య కాకపోయినను భార్యవంటిదే నని. చామరగ్రాహిణి యనగా భార్య కాదు. 'చమరీ మృగము'లని యొక జాతి జంతువులు భారతదేవములో నుండును. వాని తోకలు పెద్ద కుచ్చులుగా నుండును. ఆ కుచ్చులు పుచ్చుకొని స్త్రీలు చక్రవర్తుల కిరుప్రక్కల నిలుచుండి విసరుచుందురు. చక్రవర్తి సింహాసనము మీద కూర్చున్నప్పుడు మాత్రమే ఈ యుద్యోగముండును. తక్కినప్పుడు వారికేమియు పనియుండదు. వారికిని , చక్రవర్తికి నేమియు సంబంధముండదు. అట్టి చామరగ్రాహిణులను కొనిపోవుటకు వచ్చిన అధికారులు చెప్పిన మాటలు ప్రజాసామాన్యము నమ్మదు. అందుచేత నామె చక్రవర్తి భార్యయనియే డార్టిమో తల్లిదండ్రుల యుద్దేశ్యము. ఆమెను డార్టిమో వివాహము చేసికొనుట వారి కిష్టము లేదు.

అయినను డార్టిమో హెలీనా వెడలిపోయినప్పటినుండియు తాను వివాహము చేసికొనుట కిష్టపడలేదు. జీవితాంతము తాను మరొక స్త్రీని ప్రేమించనని

మనస్సులో నిశ్చయించుకొనెను. కాని యెవ్వరితోడను తన నిశ్చయము చెప్పలేదు. అతడు కూడ హెలీనా యాంధ్రచక్రవర్తికి భార్య యయ్యెననియే భావించెను. ఆ చక్రవర్తికి నామెకు పడకపోవుటచేత నామె తిరిగి వచ్చివేసెననుకొనెను. ఇప్పుడు హెలీనాకు చక్రవర్తిమీద ప్రేమ యుండదు. తన ప్రేమ సఫలమగునని యతని యూహ.

ఈ పదిదినములు డార్టిమో హెలీనా యింటికి వచ్చును. పవలెల్ల నచ్చటనే యుండును. వారి యింటనే భోజనము చేయును. ఆంధ్రదేశ వార్తలు వందలు వేలు హెలీనా చెప్పును. పలుమంది చెవులు దోరవెట్టుకొని వినుచుందురు. డార్టిమో కూడా వినును. హెలీనా డార్టిమోను స్నేహితుని వలె జూచును. ఆమెతో నేకాంతముగ మాటాడవలె నన్న డార్టిమోకు వీలే కలుగలేదు. హెలీనా వీలు కలుగనీయలేదు.

నీవేల వచ్చివేసితివని హెలీనాను సర్వజనులు ప్రశ్నింతురు. కొందరివద్ద నామె యామాట వినిపించుకొనదు. కొందరితో తన కచ్చట నుండుట యిష్టము లేదనును. తన చెలికత్తెలు ప్రశ్నించినప్పుడు కనులలో దైన్యము తెచ్చుకొనును. తల్లిదండ్రులు మొదటి రోజులలో నడిగినప్పుడు మనకీ సంపద చాలదా యనెను. తరువాత తరువాత సమాధానము చెప్పితిని కదా యని కసురుకొనును. వారును క్రమముగా నడుగుట మానివేసిరి. బోలెడంత సంపద వచ్చినది. ఆ సంపద కంతయు నామె యధికారిణి. అందుచేత వారూరకుండిరి.

రోజులు గడచిన కొలది హెలీనా కనులలో నొక విచారము కనిపించుచుండెను. ఎల్లప్పుడుత్సాహముగనే యుండును. ఏదో యొకవేళ దీనత్వమంతయు నామె కనులలో వచ్చి కూర్చుండును. ఆ సమయములలో నామె తానొక ప్రత్యేకపు గదిలోనికి పోయి యేకాంతముగా నుండును. ఎవ్వరితోడను మాటాడదు. గది తలుపు వేసికొనును.

నెలలు గడచినవి. డార్టిమో ప్రతిదినము వారియింటికి పోవును. పొరుగింటికి పోయినట్లేగాని, ప్రియురాలి యింటికి పోయినట్లు గాదు. వలపుటాసగల యింటికిని పోయినట్లు గాదు.

ఏడాది గడచెను. క్రమక్రమముగా హెలీనా ఆ దీనావస్థ ననుభవించు సమయముల కెడ మెక్కువయయ్యెను. హెలీనాను గుఱించి నగరములో వంద విధములుగా చెప్పుకొనుచుండిరి. హెలీనా వివాహము చేసికొనిన గాని యా కింవదంతుల కుపశాంతి యుండునట్లు లేదు. తల్లిదండ్రులు భయపడుచు భయపడుచు నామెతో నాలుగైదుసార్లు చెప్పిరి. “డార్టిమో యున్నాడు. ఇప్పుడు నీవు వివాహము చేసికొనినచో నతని తలిదండ్రులభ్యంతర పెట్టరు. ఇప్పుడు వారెంతటి ధనవంతులో మనము నంతటి ధనవంతులము. నీవు మఱల నాంధ్రదేశమునకు బోవు. నీకు ఇఱువది రెండేండ్లు దాటలేదు. బ్రతుకవలసిన దినములు బోలెడన్ని యున్నవి. డార్టిమోతో మాటాడనే మాటాడవు. అతడాఱేండ్లుగా నిన్ను ప్రేమించుచున్నాడు. అతడు నిన్ను తప్ప మఱియొక స్త్రీని ప్రేమించడు. అతని జీవితమట్లు వృథాయగుచున్నది. నీ జీవితమిట్లు వృథా యగుచున్నది.”

అని చెప్పగా చెప్పగా హెలీనా డార్టిమోతో మాట్లాడనారంభించినది. తల్లిదండ్రులు సంతోషించిరి.

వారమున కొకసారి హెలీనా డార్టిమోలు వాహ్యాళి పోదురు. డార్టిమో మొట్టమొదట నామెతో తన ప్రేమను గూర్చిన ప్రసంగము తేలేదు. నాలుగైదుసార్లు కలసి వాహ్యాళి వెళ్ళిన తరువాత నొకనాడా ప్రసక్తి తెచ్చెను. ఆమె వెంటనే లేచి వెడలిపోయెను. మఱల కొన్ని నెలలైన తరువాత వాహ్యాళికి పోయినప్పుడెల్ల నతడా ప్రసంగమే తెచ్చుటయు నామె విని యూరకుండుటయు జరుగుచుండెను.

సుమారు రెండేండ్లు గడిచినది. హెలీనా హృదయములో తనమీద ప్రేమయున్నదో లేదో డార్టిమోకు తెలియదు గాని యిద్దరి మధ్య చాల పరిచయమేర్పడెను. అతడామె భుజము మీద చేయి వైచును. అతడామె చేయి పట్టుకొనినచో ఆమె లాగికొనదు. తాను పోయి ఆమె దగ్గర కూర్చున్నచో నామె దూరముగా జరిగి కూర్చుండదు. ఎరిగియున్న వారందరు వారిద్దరిని భార్యాభర్తలుగానే భావింతురు. పెండ్లిచేసికొనకపోవుటయే వారి కాశ్చర్యము. ఇన్నాళ్ళేందుకు పట్టినదని సందేహము.

ఒకనాటి సాయంకాలమున తన్నగర ప్రాంత గిరిశిఖరము పైన వారిరువురును కూర్చుండిరి. డార్టిమో యామె చేతిని తన చేతిలో గ్రహించి యిట్లనెను. “హెలీనా! నా జీవితము నీకంకితము చేసితిని. నేను నిన్ను

ప్రేమించుచుంటిని. నీవు నన్ను ప్రేమించుట లేదు. నాకు తెలియును. కాని, నన్ను నీకు పరమాప్తుడైన స్నేహతునిగా నీవు భావించుచున్నావు. నీ మనస్సులో నున్న విచారకారణము నాకు తెలియదు. ఆ విచార హేతువేదియో నీ జీవితము నెండగట్టుచున్నది. నేను నీకు పరమాప్తుడనైన స్నేహితుడనైనచో నాకారహస్యమును చెప్పుము. నీ బాధ నేను కూడ పంచుకొందును."

అని యెంతయో బతిమాలగా హెలీనా యిట్లు చెప్పెను. "డార్టిమో! నీకంటె నాకు పరమాప్తుడు లేడు. నా మీద నీకు గల ప్రేమ దేవతాసంబంధమైనది. నిన్ను తిరిగి ప్రేమించనందుకు నాకంటె కృతఘ్నురాలుండదు. అయినను నాకు సాధ్యమగుట లేదు. నా కథ యెవ్వరికిని చెప్పకూడదనుకొంటిని. ఎవ్వరికిని చెప్పకూడదని నేను మనస్సులో ప్రతిజ్ఞ చేసికొన్న నా యీ కథ నీకు చెప్పుటతో నిన్ను తిరిగి ప్రేమించలేని పాపమునకు ప్రాయశ్చిత్తము చేసికొందును." ఈ కథ నీకు చెప్పెదను.

"నేను చాల సౌందర్యము కలదాననని నీకు తెలియును. ఆ నా గర్వమున కవధిలేదు. ఆ గర్వమునకు భగవంతుడు నన్నిట్లు శిక్షించెను. నాకు బుద్ధి తెలిసినప్పటినుండి మహా చక్రవర్తికి గాని నేను భార్యను కానని నిర్ణయించుకొంటిని. చామరగ్రాహిణి యొక్క యుద్యోగధర్మ మీ మాత్రమే యని యా యధికారులు చెప్పినపుడు నేను నమ్మలేదు. ఆ చక్రవర్తి హృదయమును చూఱగొందు ననుకొంటిని. కాని ఆంధ్రదేశమునకు చేరునంతవఱకు నాకంటె నందగత్తెలచ్చట నుందురేమో యని భయపడుచుంటిని. నాకంటె నందగత్తెలా దేశములో లేరనుటకు చక్రవర్తియే సాక్ష్యము! నా సౌందర్యమునకు చక్రవర్తి చక్రవర్తిత్వము పట్టించెను. ప్రాకృత భాషా కవులందరు నా సౌందర్యమును గూర్చి పద్యములు వ్రాసిరి. చిత్రకారులు నన్నే చిత్రించిరి. శిల్పులు నన్నే చెక్కిరి. చక్రవర్తి యొక్క అంతఃపురములో వసంతకాలములో సౌందర్యోత్సవములు చేయుదురు, ఆ ఉత్సవములకు రాణిని నేను. చక్రవర్తిత్వమునకు జరిపెడు మర్యాదలన్నియు నాయుత్సవములలో నాకు జరుపుచుండిరి. నాకన్నులలో హారతి పట్టుచుండెడివారు. నన్ను జూచిపోవుటకు పెద్ద పెద్ద మహారాజులు చక్రవర్తి ఆస్థానమునకు వచ్చుచుండెడివారు."

"నా మనస్సు మాత్రము చక్రవర్తిమీద లగ్నమై యుండెను. అన్నా! డార్టిమో! ఆ చక్రవర్తి వట్టి అధికారము చేత చక్రవర్తికాడు. ఆయన సౌందర్యముముందు నా సౌందర్యమెంత? పురుష సౌందర్యమంతయు మూర్తి కట్టిన వాడా చక్రవర్తి, ఓయి డార్టిమో! నా దురదృష్టమేమని చెప్పవలయును? అతడేకపత్నీవ్రతుడు. ప్రాచ్యదేశపు రాజులు బహుభార్యులని మనము వినుచుందుము. అది యేమియు నిజమైన మాటకాదు. ఒకవేళ నిద్దరు ముగ్గురు భార్యలున్నను ఆ భార్యలను మించి వారి కామము ప్రసరించదు. వారు మహానీతిమంతులు. ఆ దేశములను గుఱించి మనమనుకొను భావము లేవియు నిజమైనవి కావు. అది ఒక దివ్యమైన జాతి."

"నాకాశ్చర్యము. ఆ చక్రవర్తి నా సౌందర్యము నారాధించును. నాయందు ప్రేమ పొందదు. నా సౌందర్యము కొఱకు నన్నొక చక్రవర్తి భార్యను వలె గౌరవించును. గౌరవములు చేయును. ఆరాధించును. పూజించును. సౌందర్యమను నొక సామ్రాజ్యమున్నచో దానికి నేను మహారాజ్ఞిని. తక్కిన విషయముల యందునేనెందుకు పనికి రాను. ఆయన భార్య సౌందర్యవతి కాదనను. కాని నాముందేమిటి? అని చక్రవర్తి నావంక వలపుటనుమానము కల యొక చూపైన చూడడు. నన్ను రాచుకొనిపోడు. నా చేయి పట్టుకొనుటకు ప్రయత్నించడు. నా దగ్గర కూర్చుండవలెనన్న కోర్కె గూడ కనిపించదు."

"నాకా? నా మనస్సంతయు చక్రవర్తిమయముగా నుండెను. నాకు నిద్దురపట్టదు. అన్నము సయించదు. నా బ్రతుకు బ్రతుకంతయు చీకటియైనది. చక్రవర్తియెప్పుడును కొలువుతీర్చి యుండవలెననియే నాకోరిక. అప్పుడు తప్ప చక్రవర్తి దర్శనము నాకు కాదు. సంవత్సరమున కొకసారి వసంతోత్సవములలో నాయన దర్శనము జరుగును."

"అన్నా ! డార్టిమో! నేను చనిపోవలసినది. నాకు నిద్దురలేక, ఆహారము లేక, నా శరీరమునకు కలిగిన కార్శ్యము చక్రవర్తి దర్శనము కొలువులో కలిగి, ఆయనను చూచినంత సేపటిలో పోయి, నా శరీరమునకు పుష్టి కలిగెడిది. ఆయన నేత్రములు అమృతపు బావులాయేమి?"

"ఇట్లు నాలుగేండ్లు జరిగిన తర్వాత నేనోర్చుకొనలేకపోయితిని. డార్టిమో! నీ యోరిమికి నా నమస్కారము, నన్నింతగా ప్రేమించి ప్రేమ నిఘాతమును నీవెనిమిదేండ్లు యోర్చుకొంటివి. జీవితాంత మోర్చుకోగలవు. కనుక నీ ప్రేమకు నా ప్రేమకు పోలికలేదు. కనుక నీకు నాకు తగదోయి సోదరుడా! నీవు ప్రేమ కలవాడవు. నేను క్షమలేని దానను."

అని హెలీనా కొంచెము సేపు దుఃఖించి మఱల నిట్లు చెప్పెను.

"ఒకనాడు నేను చక్రవర్తి పడకగది దగ్గరకు పోయితిని. అంతఃపురస్త్రీలు ఆ నాడొక యుత్సవము చేసికొనుచుండిరి. మహారాణి,నాడు తన దగ్గరకు వచ్చునని చక్రవర్తి యనుకొనుచుండెను. మహారాణి తాను వత్తునని చక్రవర్తికి వార్త పంపించెను. రాత్రి ప్రొద్దుపోయిన తరువాత మహారాణికి తాను వెళ్ళుటకు వీలులేదని తెలిసెను. ఆ సంగతి యామె నాతో చెప్పి, పోయి చక్రవర్తికి తాను రానని చెప్పుమని నన్నాజ్ఞాపించెను. అప్పుడు నేను చక్రవర్తి గది వద్ద నుంటిని. చక్రవర్తి నిద్దురపోవుచుండెను. నా మనసులో నొక కోరిక పుట్టినది... నా కౌగిలి యొత్తిడిలో, నా చుంబనముల వేడిమిలో మేల్కొనిన చక్రవర్తికి తన కౌగిట నున్న నేను మహారాణిని కాదని యెట్లు తెలిసినదో నాకు తెలియదు. నేను మణిదీపము మీద చిక్కనిగుడ్డ కప్పి యంతయు చీకటి జేసితిని."

"మఱునిముసమున నేను దీపపు వెలుగున నిలుచుంటిని. ఆ చక్రవర్తి ప్రేమలేనివాడే గాని దయలేనివాడు కాదు. ఆ దోషమున కురిశిక్ష విధింపబడునయా డార్టిమో! చక్రవర్తి వదలిపెట్టినను మహారాణి వదలిపెట్టదయ్యా డార్టిమో!

"నా చామరగ్రాహిణి యుద్యోగము పోయినది. వారము దినములలో కూతునత్తవారింటికి పంపించినట్లు నావెంట సైన్యము నిచ్చి రెండొంటెలమీద మహాధనరాసులుంచి చక్రవర్తియు, చక్రవర్తి భార్యయు నన్ను పుట్టినింటికి పంపించిరి."

అప్పటికి చీకటి పడినది. గిరిశిఖరమునందు దూరముగా నున్న ఒక చిన్న ఏకైక వృక్షము మీద గ్రుడ్లగూబ కూసినది.